క్లుప్తంగా

కెప్టెన్ శిక్షణ పూర్తి



డాక్టర్ భవానీని సన్మానిస్తున్న అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకురాలు ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ భవానీ కెప్టెన్ శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు అభినందించారు. మంగళవారం కళాశాలలో ఆమెను సన్మానించారు. అనంతరం డాక్టర్ భవానీ మాట్లాడుతూ 2014లో లెఫ్టినెంట్ శిక్షణ పూర్తిచేసి పదేళ్లయ్యిందన్నారు. పదోన్నతికి రిఫ్రెషర్ కోర్సు గత ఏప్రిల్ 15 నుంచి మే 5 వరకు 20 రోజులపాటు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోగల ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో కెప్టెన్ శిక్షణ పొందినట్లు చెప్పారు. పదోన్నతి శిక్షణ పొందేందుకు సహకరించిన కళాశాల బృందానికి, సంగారెడ్డి బెటాలియన్ అధికారులకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



అయిలేష్ యాదవ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నీలం మధు

మర్కూక్(గజ్వేల్): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాజీ సీఎం దత్తత గ్రామం ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ములుగు(గజ్వేల్): మండలంలోని బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు, మండల యాదవ సంఘం అధ్యక్షుడు యాంజాల అయిలేష్ యాదవ్ మంగళవారం కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు.

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు, వారితో పాటు మరో 150 మంది మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచంద్రమౌళీశ్వర స్వామి కల్యాణం

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో మంగళవారం శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. క్షేత్రంలో చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులైన సందర్భంగా మండల ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద పండితులు తెల్లవారు జామున చంద్రమౌళీశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. అనంతరం రుద్రహోమం, స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

తొగుట(దుబ్బాక): మండలంలోని రాంపురం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఆ కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులను కోరారు. మండలంలోని చందాపూర్‌లో మంగళవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని చెప్పారు. ప్రైవేటు కళాశాల్లో చేర్పించి ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రైవేటు కళాశాలల ప్రకటనలను చూసి మోసపోవద్దన్నారు.

నగదు సీజ్

సిద్దిపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో వాహనంలో తగిన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అపూర్వ రెడ్డికి తెలిపారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టారు. మొహినిపురకు చెందిన రిజ్వాన బేగం తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1,82,000 తీసుకెళ్తోంది. దీంతో ఆ నగదును సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామ కేదారేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

అదనపు కలెక్టర్, దుబ్బాక ఏఆర్‌ఓ గరీమా అగర్వాల్

దుబ్బాక: 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్, దుబ్బాక అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ అన్నారు. మంగళవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులను సిబ్బంది బాధ్యతతో నిర్వహించాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇద్దరు వలంటీర్లు, వీల్‌చైర్ అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీపీఓ దేవకీదేవి, డీఎల్‌పీఓ మల్లికార్జున్, ఏఆర్‌ఓ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీడీ యజమానుల సంఘం కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గ బీడీ యజమానుల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట కిశోర్, ఉపాధ్యక్షుడిగా పులుగం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బోనాల రాజేశం, సంయుక్త కార్యదర్శిగా చిలుక చంద్రమౌళి, కోశాధికారిగా బోగ గోవర్ధన్, సలహాదారులుగా పేర్ల నర్సింహులు, పోచయ్య, అశోక్, నరేందర్, వెంకటేశం, కార్యవర్గ సభ్యులుగా సత్యం, పాండు, బాల్‌రాజు, విజయ, శ్రీనివాస్, వెంకట్, భిక్షపతి ఎన్నికయ్యారు.

విద్యార్థులు కథల పుస్తకాలు చదవండి

సుగణ సాహిత సమితీ కన్వీనర్ దుర్గయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు కథల పుస్తకాలు చదువుతూ సంస్కృతి, సభ్యత అలవర్చుకోవాలని పుస్తక పఠనంతో వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలని సుగుణ సాహితీ సమితి కన్వీనర్ బైతి దుర్గయ్య అన్నారు. స్మార్ట్ ఫోన్ వీడియో గేమ్‌లకు బానిసలు కాకూడదన్నారు. మంగళవారం సిద్దిపేట శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో డాక్టర్ సిరి రాసిన సిల్వర్ ఫీతర్ కథల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతుకు నరేష్‌కుమార్, బాలసాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ మోతుకు నరేష్‌కుమార్

నూతన పోస్టల్ బ్యాలెట్ విధానంపై హర్షం



ఓటుహక్కు వినియోగించుకున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని సులభతరం చేయడంపై టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐఓసీ)లో పోస్ట ల్ బ్యాలెట్ వినియోగించుకున్న అనంతరం మాట్లాడారు. గతంలో ఓటుహక్కు వినియోగంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. పాత నిబంధనలు మార్చి నూతన విధానంలో ఉద్యోగి పనిచేస్తున్న ప్రాంతంలోనే ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాట చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికలకు నాలుగు రోజుల ముందుగా ఓటుహక్కును వినియోగించుకోవడం వల్ల సిబ్బందికి ఇబ్బంది ఉండదన్నారు. ఈ విధానాన్ని రూపొందించడంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డబ్బు రాజకీయాలను తిప్పి కొట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాల కేంద్రంగా నడుపుతున్న డబ్బు రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎంపీ ఎన్నికలను ప్రతాప్‌రెడ్డి తన ఇంటిని కేంద్రంగా చేసుకొని బూతు కమిటీ సభ్యుల సమావేశం పేరుతో డబ్బులు, మద్యం పంపిణీ చేస్తూ కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల కమిషన్ విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్ఓ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ వైద్యాధికారులకు సూచించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని పల్లె దవాఖానాల్లో పని చేస్తున్న ఆయుష్ వైద్యాధికారులు, ఎమ్ఎల్‌హెచ్‌పీలకు ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవల కోసం వచ్చే వారితో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించి కారణాలు తెలుసుకుని నివేదికను పీహెచ్‌సీ వైద్యాధికారికి అందజేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ వినోద్‌బాబ్జి, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజని, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

కొనసాగుతున్న బాలసంస్కార్ వేసవి శిక్షణా శిబిరం



కార్టూన్ చిత్రకళపై శిక్షణ ఇస్తున్న రమణారావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో బాల సంస్కార్ వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. మంగళవారం విద్యార్థులకు కార్టూన్ చిత్రకళలో ప్రముఖ కార్టూనిస్ట్ నెల్లుట్ల రమణారావు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతలతో నవరసాలను, భావోద్వేగాలను కార్టూన్ ద్వారా వ్యక్తీకరించవచ్చన్నారు. సమకాలీన సమస్యలపై అవగాహనతో కార్టూన్లు వేస్తే ఎందరినో ఆలోచింపజేయ వచ్చని సూచించారు. బాల సంస్కార్ కోర్స్ డైరెక్టర్ తోట సంధ్య, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ప్రముఖ యోగా శిక్షకుడు సతీష్, కవి బసవరాజ్ రాజ్‌కుమార్ రామణారావును సన్మానించారు.

నెమలిని రక్షించిన అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిల్లాపూర్‌లో రైతు బండి స్వామికి చెందిన వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు నెమలి పడిపోయింది. గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాముడు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని బావిలో పడిన నెమలిని వెలికితీశారు. నీళ్లు తాగించి అడవిలోకి వదిలారు.



బావిలో పడిన నెమలిని రక్షించిన అధికారులు

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆడివయ్య అన్నారు. మంగళవారం జహంగీర్‌కు మద్దతుగా మర్రిముచ్చాల అయినాపూర్, తపాసుపల్లి, గురువన్నపేట గ్రా మాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకులను ఓడించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్య దర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఏపీడీ మధుసూదన్

సాక్షి ఎఫెక్ట్..

చిన్నకోడూరు(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని ఏపీడీ మధుసూదన్ ఆదేశించారు. మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు శీర్షిక సోమవారం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన ఏపీడీ మంగళవారం చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ

మిరుదొడ్డి(దుబ్బాక): ఈనెల 8వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే డీఎస్‌పీ ఎన్నికల ప్రచారసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రోల్ల దీపక్ మహారాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మిరుదొడ్డిలో ప్రచార సభ కరపత్రాలను ఆవిష్కరించారు.

వసతులు కల్పించాలి

సిద్దిపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించాలని కోరుతూ పీఆర్టీయూ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు విధులు నిర్వహిస్తారని, ఇందుకు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

దుబ్బాకటౌన్: సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి అన్నారు. పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మంగళవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్ల కేంద్ర బీజేపీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మెదక్ అభివృద్ధి కేవలం రఘునందన్ రావుతోనే సాధ్యమన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి ఆయనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు సిద్దిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దేశం కోసం, ధర్మకోసం, ప్రజల కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రఘు నందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, సిద్దిపేట ఎన్నికల ప్రచార కమిటీ కోకన్వీనర్ తొడుపునూరి వెంకటేశం, సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శులు కెమ్మసారం సంతోష్‌కుమార్, పిట్ల నరేష్, బొడ్డు సునీల్, పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి బొమ్మగోని పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పేరిట

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరిట మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ నాయకుల వాగ్దానాలను ప్రజలు నమ్మొద్దని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దుతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



బీజేపీకి ఓటు వేయాలని వృద్ధురాలిని కోరుతున్న దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి

ప్రతీ అభివృద్ధి పనిలో ..

గజ్వేల్‌రూరల్: ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వ నిధులున్నాయని, ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న బీజేపీకి ఓటువేయాలని ఆ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడలో మంగళవారం బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రిమ్మనగూడ గ్రామ బూత్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాలయాపన

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి కోరారు. మంగళవారం పట్టణ పరిధిలోని పలువార్డుల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పాలనలో అందిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం..

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు ఏర్పాల మహేష్ ప్రజలను కోరారు. మంగళవారం ఆయనకు మద్దతుగా మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి కిష్టయ్య, గ్రామ అధ్యక్షులు కనకమల్లేశం, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి తదితరులు

డీబీఎఫ్ కార్యదర్శికి పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తండ్రి మరణ వార్త తెలుసుకొని హైదరాబాద్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట నుంచి మండల పరిధిలోని లింగుపల్లికి ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు, దళిత నేతలు, జర్నలిస్టు యూనియన్ నాయకులు మంగళవారం తరలివచ్చి పరామర్శించారు. శంకర్ తండ్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శంకర్‌ను పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాములు, కొడకండ్ల కృష్ణ, జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షుడు కళ్యారి సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఓటుతో గుణపాఠం చెప్పాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అభివృద్ధి సాధకుడని, ఆయన గెలుపు ఖాయమైందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పెర్యాల రవీందర్‌రావు, ఎంపీపీ మాలోతు లక్ష్మీ అన్నారు. అక్కన్నపేట మండలం మోత్కులపల్లి, పెద్దతండా, పంజాగుట్టు తండా గ్రామాల్లో మంగళవారం వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్‌కు మద్దతుగా మండలంలోని దాచారం, గాగిల్లాపూర్ గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను కలిసి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.



పెద్దతండాలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రవీందర్‌రావు

అభివృద్ధికి ఓటు వేయండి

కోహెడ(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షంతో కార్నర్ మీటింగ్ వాయిదా వేశామని, త్వరలో మీటింగ్ తేదీ ప్రకటిస్తామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌తో విధ్వంసమే తప్ప అభివృద్ధి జరగదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ని నమ్మొద్దు

మర్కూక్(గజ్వేల్): సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మొద్దని, ఓటుతో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మంగళవారం మండలంలోని వర్దరాజ్‌పూర్, దామరకుంట గ్రామంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

ఓటు వేసి మోసపోవద్దు

నంగునూరు(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటువేసి మోసపోవద్దని మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మల్లయ్య అన్నారు. మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మంగళవారం మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామంచ, గంగాపూర్ గ్రామాల్లో పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నీలం మధుకే మా మద్దతు**

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు గజ్వేల్ మండలం బెజుగామ ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని కలిసి మద్దతు నిర్ణయం తెలిపారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడారు. నీలం మధు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

◆ **చామలను గెలిపించాలి**

చేర్యాల(సిద్దిపేట): ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు కోరారు. మంగళవారం పట్టణ పరిధిలోని బురాన్మియా తోట, రోళ్లబండ, గుంటూరుపల్లి, సుందరయ్య నగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

◆ **ఆర్థిక సాయం**

మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మూడు నెలల క్రితం వర్దరాజ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **బీజేపీ బైక్ ర్యాలీ**

కోహెడ(హుస్నాబాద్): బీజేపీ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ కరీంనగర్‌కు బండి, దేశానికి మోదీ అవసరమన్నారు.

◆ **చర్చలు లేకుండా ముగిసిన సమావేశం**

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ మండల పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన జరిగిన సమావేశం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి చర్చలు జరగకుండానే ముగిసింది.

◆ **అక్రమ మద్యం స్వాధీనం**

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి ఇమాంబాద్‌లో పిల్లి శ్రీకాంత్ హోటల్ నిర్వహిస్తున్నాడు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు సిబ్బందితో కలిసి వెళ్లి సోదాలు చేశారు. హోటల్‌లో నిల్వ ఉన్న 5.300 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

◆ **ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను మంగళవారం సామాజిక కార్యకర్త పట్నం రమేష్ ప్రారంభించారు. ఇంటర్ వరకు ఉచితంగా ప్రతీరోజు తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.